## అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

- ఫ్రీ బస్సుతో ఉపాధి కరువు
- ప్రైవేటు ఫైనాన్స్‌లో ఇల్లు తాకట్టు
- తీర్చే మార్గంలేక మనస్తాపం చెంది..

బోనకల్లు, డిసెంబర్ 6: ఖమ్మం జిల్లా బోనకల్లు మండల కేంద్రంలో శుక్రవారం అప్పుల బాధతో ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. బోనకల్లు మండలం ఆళ్లపాడుకు చెందిన మరీదు అంజయ్య(55) కొన్నేళ్ల క్రితం బోనకల్లు వచ్చి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం తెచ్చిన అప్పులు తీరకపోవడంతో ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో ఇంటిని తాకట్టు పెట్టి రూ.8 లక్షలు లోను గా తీసుకున్నాడు. ఫ్రీ బస్సు పథకంతో ప్రయాణికులు ఆటోలు ఎక్కే పరిస్థితి లేకపోవడం వల్ల కుటుంబ పోషణ బరువై ఇబ్బంది పడుతున్నా డు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన అం జయ్య గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగాడు. ఖమ్మం ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు.

# ఉయ్యాలే.. ఉరితాడై..

- మెడకు చీర చుట్టుకుని బాలిక మృతి

*మానకొండూర్ రూరల్, డిసెంబర్ 6 :* ఓ చీరెతో కట్టిన ఉయ్యాల ప్రమాదవశాత్తు మెడకు చుట్టుకోవడంతో ఊపిరి ఆడక ఓ బాలిక మృతి చెందిన ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌లో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా వావిలాల ప్రాంతానికి చెందిన సైరున్నీసా-ముజఫర్ అలీకి కొడుకు, కూతురు ఉన్నారు. ముజఫర్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సైరున్నీసా సోదరుడి వివాహం ఉన్నందున 2 నెలల క్రితం తల్లి గారి గ్రామమైన మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌కు భర్త, కొడుకు మహ్మద్ ఉజేర్, కూతురు తబస్సుమ్ (14)తో కలిసి వచ్చి ఉంటున్నారు. శుక్రవారం ఉదయం సైరున్నీసా స్నానానికి వెళ్లగా, తమ్ముడు, కొడుకు ఇద్దరూ కలిసి బయటకు వెళ్లారు. ఇంట్లో తబస్సుమ్ మాత్రమే ఉంది. తల్లి స్నానం చేసి వచ్చి చూసే సరికి కూతురు కనబడలేదు. దీంతో సైరున్నీసా తన తల్లి కలిసి ఇంట్లోనే ఉన్న రేకుల షెడ్డు తలుపులను తెరిచేందుకు వెళ్లగా, తలుపులు రాకపోవడంతో బలవంతంగా తీసి చూ డగా ఉయ్యాలకు కట్టిన చీర బాలిక మెడకు చుట్టుకొని ఉంది. వెంటనే 108లో కరీంనగర్ దవాఖానకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. తన కూతురు ఉయ్యాల ఊగుతూ ప్రమాదవశాత్తు మెడకు చుట్టుకోవడంతో మృతి చెందినట్టు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

## కౌలు రైతు ఆత్మహత్య

- పంటలు పండక అప్పుల పాలు

భూక్యా భద్రూ(ఫైల్)

గార్ల, డిసెంబర్ 6: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పినిరెడ్డిగూడెంలో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్యా భద్రూ(41) పుట్టుకతో మూగ, చెవిటివాడు. నాలుగేళ్లుగా రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మిర్చి, పత్తి పంట వేయగా, సరిగా పండక అప్పుల పాలయ్యాడు. రూ. మూడు లక్షలు అప్పు కాగా, వాటిని ఎలా తీర్చాలనే మనస్తాపంతో ఈ నెల 5న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా దవాఖాన కు తరలించారు. మెరుగైన వైద్య కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## నేటి ఆటోబంద్ వాయిదా

- సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్ డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నేడు (శనివారం) నిర్వహించతలపెట్టిన ఆటోబంద్‌ను విరమించుకున్నట్టు ఆటో యూనియన్ జేఏసీ నేతలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో శుక్రవారం ప్రకటించారు. అంతకు ముందు తమ డిమాండ్లను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావును జేఏసీ నేతలు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీలోపు ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. చర్చల్లో తనతోపాటు ఎమ్మెల్సీ కోదండరాం, ఆటో యూనియన్ జేఏసీ నేతలు పాల్గొంటారని, దీంతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సమస్యల పరిష్కారానికి సీఎం దగ్గరికైనా వెళ్తామని కూనంనేని తెలిపారు. ఆటో కార్మికులు మహాలక్ష్మి పథకానికి వ్యతిరేకం కాదని, వారికి ఏడాదికి రూ.15వేలు, 50ఏండ్లు నిండిన వారికి పింఛన్, సంక్షేమ బోర్డు తదితర హామీలను అమలు చేయాలని పేర్కొన్నా రు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

# రుణమాఫీ ముగిసినట్టే!

- రూ.2 లక్షలకుపైన ఉన్నవారికి మొండిచెయ్యే?
- మాఫీ చేస్తారా? అన్న ప్రశ్నకు బదులివ్వని భట్టి
- ఇంధనరంగంలో అదానీతో ఎంవోయూపైనా వెనక్కి..
- ఓపెన్ టెండర్ల ద్వారా రావాల్సిందేనన్న డిప్యూటీ సీఎం

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ కథ ఒడిసినట్టేనా? పంట రుణం రూ.2 లక్షలకుపైగా ఉన్న రైతులకు మాఫీ ఆగిపోయినట్టేనా?.. అంటే శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిర్వహించిన మీడియా సమావేశాన్ని బట్టి ఇదే అర్థమవుతున్నది. సచివాలయంలో ఆయన మాట్లాడుతుండగా రూ.2 లక్షలకుపైగా రుణమాఫీ ఎప్పుడు చేస్తారని జర్నలిస్టులు పదే పదే ప్రశ్నించినా, సమాధానం ఇవ్వలేదు. దీనిని బట్టి రుణమాఫీ ఆగిపోయినట్టేనని ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి. రైతులకు ఇప్పటివరకు రూ.20,617 కోట్ల మేర రుణమాఫీ చేసినట్టు చెప్పారు. మొదటి విడతలో రేషన్ కార్డు ఆధారంగా రుణమాఫీ చేశామని, మిగతావారిలో అర్హులను గుర్తించి రెండో విడతలో పూర్తి చేశామని చెప్పారు. గతంలో బ్యాంకర్లు తప్పుడు సమాచారం ఇవ్వడంతో పంట రుణాలు రూ.31వేల కోట్లు ఉన్నట్టు భావించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఎప్పుడూ రైతులకు బీమా చేయలేదని, తాము రూ.1514 కోట్లు బీమా కోసం చెల్లించామని చెప్పారు. అయితే.. భట్టి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు, రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రైతుబీమా పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లోనే ప్రారంభించిందని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 18-59 ఏండ్ల మధ్యవయసున్న రైతులకు బీమా సదుపాయం కల్పించిందని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దానిని కొనసాగించిందే తప్ప కొత్త పథకం కాదని స్పష్టం చేస్తున్నారు.

**ఎంవోయూ చేసుకుంటే ఇస్తామన్నట్టు కాదు**

2030 నాటికి 20వేల మెగావాట్లు, 2035 నాటికి అదనంగా మరో 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి తమ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని భట్టి చెప్పారు. త్వరలో ఎనర్జీ పాలసీని ఆవిష్కరిస్తామని తెలిపారు. అదానీ ఎనర్జీస్ కంపెనీ రాష్ట్రంలో రూ.5వేల కోట్లతో 1350 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు దావోస్‌లో జరిగిన ఒప్పందంపై స్పందిస్తూ.. ఎంవోయూలన్నీ.. మీ రాష్ట్రంలో పెట్టుబడి పెడుతున్నామని చెప్పడానికి మాత్రమే. ఎంవోయూ చేసుకున్నంత మాత్రాన ఇస్తామని ఎక్కడా లేదు. కచ్చితంగా ఇవ్వాలని కాదు. నూతన ఇంధన పాలసీని ఆవిష్కరించిన తర్వాత టెండర్లు పిలుస్తాం. ఎంవోయూ చేసుకున్నవాళ్లయినా టెండర్ల ప్రకారం రావాల్సిందే' అని స్పష్టం చేశారు. అయితే భట్టి కామెంట్లను నిపుణులు విమర్శిస్తున్నారు. పెట్టుబడులపై చర్చించి, పూర్తిగా అవగాహన వచ్చిన తర్వాతే ఎంవోయూ చేసుకుంటారని గుర్తు చేస్తున్నారు. అదానీ ఎంవోయూను పరిగణనలోకి తీసుకోనప్పుడు దావోస్‌లో రూ.40వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ప్రభుత్వం ఎందుకు ప్రచారం చేసుకుంటున్నదని ప్రశ్నిస్తున్నారు.

**రూ.52,118 కోట్ల అప్పులు తెచ్చాం**

ప్రభుత్వం డిసెంబర్ నుంచి ఇప్పటివరకు రూ.52,118 కోట్ల రుణాలు తీసుకున్నట్టు భట్టి విక్రమార్క తెలిపారు. ఇదే సమయంలో అసలు, మిత్తి కలిపి రూ.64,516 కోట్లు చెల్లించినట్టు తెలిపారు. వీటికి అదనంగా పెట్టుబడి వ్యయం కోసం రూ.24,036 కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.61,194 కోట్లు ఖర్చు చేసినట్టు పేర్కొన్నారు. ఇందులో రైతు భరోసా పథకానికి రూ.7,625 కోట్లు, రుణమాఫీకి రూ.20,617 కోట్లు, చేయూత పథకానికి రూ.11,382 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కి రూ.890 కోట్లు, రాయితీ సిలిండర్లకు రూ.442 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.1234 కోట్లు, రైతులకు విద్యుత్ సబ్సిడీకి రూ.11,141 కోట్లు, రైతు బీమా ప్రీమియం చెల్లింపునకు రూ.1514 కోట్లు, బియ్యం సబ్సిడీకి రూ.1647 కోట్లు, స్కాలర్‌షిప్ డైట్ చార్జీలకు రూ.1016 కోట్లు, ఆర్టీసీకి రూ.1375 కోట్లు, కళ్యాణ లక్ష్మి /షాదీ ముబారక్ పథకాలకు రూ.2311 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలోని 3,69,200 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 2.88 లక్షల మంది పెన్షన్‌దారులకు ఈ ఏడాది మార్చి నుంచి ఒకటో తేదీన వేతనాలు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. గృహ జ్యోతి పథకం ద్వారా 49,71, 007 కుటుంబాలు లబ్ధి పొందుతున్నారని, ఇప్పటివరకు 3,64,57,380 జీరో బిల్లులు జారీ చేసినట్టు తెలిపారు. 2035 నాటికి తెలంగాణను విద్యుత్ మిగులు రాష్ట్రంగా మారుస్తామని తెలిపారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. 2025 మే నాటికి ప్రాజెక్టు పూర్తిచేస్తామని చెప్పారు.

## 30న నూతన టూరిజం పాలసీ

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకురానున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. నూతన టూరిజం పాలసీపై శుక్రవారం టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దుబాయ్, సింగపూర్, చైనా దేశాల్లోని టూరిజం పాలసీలను అధ్యయనం చేసి ఈ నెల 30 లోగా కొత్త పాలసీని రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, టూరిజం శాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్, ఎండీ ప్రకాశ్‌రెడ్డి, సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ తీరుపై గరం గరం

- రగిలిపోతున్న ఆర్టీసీ కార్మికులు
- 'చలో బస్‌భవన్' నిర్వీర్యానికి యత్నించడంపై ఆగ్రహం
- 9 తర్వాత భారీ కార్యాచరణకు ప్రణాళికలు

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆర్టీసీ కార్మికులు రగిలిపోతున్నారు. ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలపై ఊసెత్తకపోవడమే కాకుండా, కార్మికుల మధ్య చిచ్చు పెడుతున్నదని మండిపడుతున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు గురువారం చేపట్టిన 'చలో బస్‌భవన్'ను విఫలం చేసేందుకు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రయత్నించడంపై ఆర్టీసీ జేఏసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి సరైన రీతిలో బుద్ధి చెప్పాలని ఈ నెల 9 తర్వాత ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు నిర్ణయించినట్టు ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. చలో బస్‌భవన్‌కు ఆర్టీసీ కార్మికులు హాజరుకాకుండా డిపో మేనేజర్లు భయపెట్టి, బలవంతంగా సీఎం మీటింగ్‌కు తరలించారని పేర్కొన్నారు. మరోపక్క బస్ భవన్ వద్ద మీటింగ్ జరుగకుండా అనుమతి రద్దు చేసిన అధికార యంత్రాంగం, మరోవైపు జేఏసీ నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలిచిందని విమర్శించారు. ప్రభుత్వ కాళ్ల కింద పనిచేసే కొన్ని సంఘాల నాయకులు బూటకపు ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కార్మికులు హాజరై చలో బస్‌భవన్‌ను విజయవంతం చేశారని పేర్కొన్నారు.

## తండ్రి మరణం తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య

శ్రీశైలం(ఫైల్)

సంస్థాన్‌నారాయణపురం, డిసెంబర్ 6 : తండ్రి మరణాన్ని తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కాటం రాములు గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటుండగా, చిన్న కుమారుడు శ్రీశైలం(40) గ్రామంలోనే ఉంటూ ట్రాక్టర్ నడుపుతూ తల్లిదండ్రుల బాగోగులు చూసుకుంటున్నాడు. తల్లికి ఆరోగ్యం బాగాలేకపోవడం, తండ్రి చనిపోవడంతో మనోవేదనకు గురైన శ్రీశైలం తండ్రి అంత్యక్రియలు ముగిసిన అనంతరం గ్రామంలోని వ్యయసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని ఇంటికి తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీశైలానికి పెండ్లి కాలేదు. తండ్రీకొడుకులు ఒకే రోజు మృతిచెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి.

లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన మహాదేవ్‌పల్లి పంచాయతీ కార్యదర్శి ఉమేశ్

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

కల్హేర్, డిసెంబర్ 6: చేపల దుకాణం ఏర్పాటు కోసం ఎన్‌వోసీ ఇవ్వడానికి పంచాయతీ కార్యదర్శి రూ.15 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిన ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. కల్హేర్ మండలం మాసాన్‌పల్లికి చెందిన ఓ వ్యక్తి మహాదేవుపల్లి శివారులోని చౌరస్తాలో చేపల దుకాణం పెట్టుకునేందుకు బ్యాంక్ లోన్ అవసరం పడింది. ఎన్‌వోసీ ఇచ్చేందుకు మహాదేవ్‌పల్లి పంచాయతీ కార్యదర్శి సీ ఉమేశ్ రూ.15 వేల లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. మెదక్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి వలపన్ని శుక్రవారం కోహీర్ మండల ప్రజా పరిషత్ వెనుక బాధితుడు కార్యదర్శికి నోట్లు ఇస్తున్న క్రమంలో పట్టుకున్నారు. కార్యదర్శిపై కేసు నమో దు చేసి, నాంపల్లిలోని ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చనున్నట్టు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు.

## ప్రశ్నించే గొంతులను అరెస్టులతో ఆపలేరు

- నరసింహారెడ్డి ఆగ్రహం

మఠంపల్లి, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): ప్రజాసమస్యలపై ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులతో ఆపలేరని బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి తెలిపారు. మఠంపల్లి మండలం భీమ్లాతండాలో జరిగిన బానోతు పాచ్యానాయక్ హత్యను కాంగ్రెస్ చేసిన హత్యగానే పరిగణిస్తున్నామని స్పష్టంచేశారు. హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఓ కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదలైన మన్నెం శ్రీనివాస్‌రెడ్డిని నర్సింహారెడ్డి పరామర్శించారు.

# నమ్మి వచ్చినం.. నట్టేట ముంచొద్దు

> మొదటిపేజీ తరువాయి...

వేగంగా అల్లర్లు పుట్టించి తననో విఫల నేతగా ప్రజల ముందు ఉంచేందుకు కుట్రలు చేస్తున్నారని ముఖ్యనేత వారితో ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. వీళ్ల దాడిని తిప్పి కొట్టాలంటే.. పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, ఏడాది పాలనపై ప్రజాక్షేత్రంలోకి వెళ్లి సత్తా చూపితే ఒక్క దెబ్బతో అందరి నోళ్లు మూయించవచ్చన్నది ముఖ్యనేత ఆలోచనగా ఉన్నట్టు సమాచారం. ప్రజలు తమ పట్ల విశ్వాసంతో ఉన్నారని, కేటీఆర్, హరీశ్‌రావు తనను ముందుకు పడనివ్వటం లేదని ప్రజలు గ్రహించారని ఆ ముఖ్యనేత భావిస్తున్నట్టు తెలిసింది. ఆరు గ్యారెంటీలు పూర్తిగా అమలు కాకున్నా.. అమలు చేస్తున్న హామీలతో ప్రజల్లో సానుకూలత ఉందనే ఇంటెలిజెన్స్ నివేదికలు వస్తున్నాయని, కాబట్టి ఫిరాయింపు ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్తే.. ప్రతిపక్షాల చెంప మీద కొట్టినట్టు ఉంటుందని ముఖ్యనేత ప్రతిపాదించినట్టు తెలిసింది.

**రాజీనామాకు ససేమిరా**

ప్రజల్లో సానుకూలత ఉందని చెప్పటం తప్పుడు సమాచారమని, ఉపఎన్నికలకు వెళ్తే అధికారాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కేసీఆర్‌కు అప్పగించినట్టేనని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఫిరాయింపు ఎమ్మెల్యే కుండబద్దలు కొట్టినట్టు తెలిసింది. ఇండ్లు కూల్చటం, భూములు గుంజుకోవటం మినహా.. ఏం చేశామని ప్రజల్లోకి వెళ్లి చెప్పుకుంటామని నిలదీసినట్టు సమాచారం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే.. 'తమ్మీ నిన్ను నమ్మి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినం. రాజీనామాలు, ఉప ఎన్నికలు అంటూ గొంతుకోసే ప్రయత్నాలు చేయకు. రాజీనామా చేయం, ఉప ఎన్నికలకు వెళ్లం' అని ఒకింత గట్టిగానే చెప్పినట్టు తెలిసింది. రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, పోలీసులు ఏ ఒక్క వర్గమైనా మనతో ఉందా? అని ప్రశ్నించినట్టు అంతర్గత వర్గాలు వెల్లడించాయి. రైతు రుణ మాఫీ, ఆరు గ్యారెంటీల అమలు మీద జనం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని స్పష్టంచేసినట్టు సమాచారం. హైదరాబాద్‌లో హైడ్రా, ఎఫ్‌టీఎల్ అంటూ ఇండ్లు కూలగొట్టిన ప్రభావం ఒక్క బాధితుల మీదనే ఉంది అనుకుంటున్నారా? అంటూ నిలదీసినట్టు తెలిసింది. ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ ప్రజల పక్షాన అత్యంత సమర్థంగా పనిచేస్తున్నదని, హైడ్రా, మూసీ బాధితులు, ఆశా వర్కర్లు, ఆటో డ్రైవర్లు, గ్రూప్-1 అభ్యర్థులు, లగచర్ల బాధితులు ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా తెలంగాణ భవన్‌కే వెళ్తున్నారని చెప్పినట్టు తెలిసింది. ప్రభుత్వం ప్రజాభవన్‌లో పెట్టిన గ్రీవెన్స్ సెల్‌కు వచ్చే ఫిర్యాదుల కంటే తెలంగాణ భవన్‌కు వెళ్తున్న జనాలే ఎక్కువని సీనియర్ ఎమ్మెల్యే తేటతెల్లం చేసినట్టు సమాచారం.

**10 సీట్లలో 70శాతం కేసీఆర్‌వైపే**

గద్వాల, భద్రాచలం, స్టేషన్‌ఘన్‌పూర్, జగిత్యాల, బాన్సువాడ, చేవెళ్ల, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో రహస్యంగా ప్రజాభిప్రాయం సేకరించాలని ముఖ్యనేత కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్తను కోరినట్టు తెలిసింది. ఈ మేరకు సదరు వ్యూహకర్త అక్టోబర్ మాసం నుంచి నవంబర్ చివరి వారం వరకు ఆయా నియోజకవర్గాల్లో రెండు పర్యాయాలు రహస్య సర్వే నిర్వహించినట్టు సమాచారం. ఆయా నియోజకవర్గాల్లో 70 శాతం మంది ప్రజలు కేసీఆర్ పట్ల సుముఖత వ్యక్తం చేశారని ఆ వ్యూహకర్త ముఖ్యనేతకు నివేదించినట్టు తెలిసింది. తొందరపడి ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్తే 75 శాతం నుంచి 100 శాతం సీట్లలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే గెలిచే ప్రమాదం ఉందని నివేదించినట్టు తెలసింది.

## అకాల వర్షం.. తడిసిన ధాన్యం

రాష్ట్రంలో పలుచోట్ల గురువారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాలు, మార్కెట్‌యార్డులో ఉన్న ధాన్యం తడిసిపోయింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీటిపాలు కావడంతో రైతుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతున్నది. కొనుగోళ్ల ఆలస్యం కావడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని పలువురు రైతులు వాపోయారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన వడ్లు తడిశాయి. తూకంలో ఆలస్యం కావడంతో రైతులు ధాన్యాన్ని మార్కెట్ యార్డులోనే ఉంచాల్సి వచ్చింది. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో 54 బస్తాల ధాన్యం వర్షార్పణమైంది. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోత లేకుండా కొనాలని రైతులు డిమాండ్ చేశారు. -పెద్దపల్లి/కోడేరు

## దళితులకు నష్టం చేస్తే ఊరుకోం

- అవసరమైతే సీఎంను కమిషన్ ముందు నిలబెడుతా
- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్

గోదావరిఖనిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

కోల్‌సిటీ, డిసెంబర్ 6 : రాష్ట్రంలో దళితులపై వివక్ష చూపవద్దని, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహించాలని ప్రభుత్వానికి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ సూచించారు. రాష్ట్రంలో దళితులకు ఏమాత్రం నష్టం కలిగించినా ఊరుకునేది లేదని, అవసరమైతే సీఎంను కమిషన్ ఎదుట నిలబెడుతానని స్పష్టం చేశారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రామగుండం బల్దియా కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 11 రాష్ట్రాల్లో దళితుల ఆర్థిక అసమానతల గురించి నివేదికలు తయారు చేస్తున్నామని చెప్పారు. కోరుకంటి మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో దేశంలోనే ఏ ప్రభుత్వం సాహసించని విధంగా హైదరాబాద్ నడిబొడ్డున 125 ఫీట్ల అంబేద్కర్ విగ్రహంతోపాటు సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం గొప్ప విషయమని కొనియాడారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీశ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.

అమరచింతలో గుడిసెవాసులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరిని అడ్డుకుంటున్న సీపీఎం నాయకులు

## మక్తల్ ఎమ్మెల్యే అడ్డగింత

**పేదలకిచ్చిన ఇండ్లస్థలాలకు హద్దులు కేటాయించాలని సీపీఎం నేతల డిమాండ్**

అమరచింత, డిసెంబర్ 6 : అమరచింత పట్టణ శివారులోని దుంపాయికుంటలో పేదలకు అందజేసిన ఇండ్ల స్థలాలకు హద్దులు కేటాయించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రానికి వచ్చిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని వారు అడ్డుకున్నారు. 30 ఏండ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లులేని పేదలకు 130 మందికి పట్టాలు ఇచ్చిందని, కానీ హద్దులు చూపలేదని నాయకులు గోపి, వెంకటేశ్, అజయ్, రమేశ్ తెలిపారు. దీంతో పట్టాదారులు చాలా రోజులుగా అక్కడ గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా పేదలను గుర్తించి స్థలాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే శ్రీహరి గుడిసెలు వేసుకుని వారి వివరాలు సేకరించి పార్టీలకతీతంగా అర్హులను గుర్తించాలని తహసీల్దార్ రవికుమార్‌ను ఆదేశించారు.

## ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటరే

- మావోయిస్టు మధు భార్య మీనా

ములుగు జిల్లా ఏటూరునాగారంలో విలేకర్లతో మాట్లాడుతున్న మావోయిస్టు మధు భార్య మీనా

ఏటూరునాగారం, డిసెంబర్ 6: తన భర్త ఎగలోపు మల్లయ్య అలియాస్ మధు మృత దేహంపై తూటా తగిలిన గాయం ఒక్కటి కూడా లేదని, తల పగులగొట్టి చిత్రహింసలకు గురి చేసి చంపేశారంటూ మధు భార్య మీనా ఆరోపించారు. ఈ నెల 1వ తేదీన చెల్పాక అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు నక్సల్స్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆరుగురి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులు, బంధువులు తీసుకెళ్లారు. ఎన్‌కౌంటర్ మృతిపై అనుమానం ఉందంటూ మధు భార్య మీనా తరఫున హైకోర్టులో లంచ్ మోషన్‌లో న్యాయవాది దశరథ్ పిటిషన్ వేశారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు మీనా ములుగు జిల్లా ఏటూరునాగారం వచ్చిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. మధు మరణం ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటర్‌గా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసు రాజ్యం నడుస్తున్నదని మండిపడ్డారు. ముందుగానే కుట్ర పన్ని విషం పెట్టి చంపేసిన తర్వాత శరీరాన్ని ఛిద్రం చేశారని ఆరోపించారు. నిజమైన ఎదురు కాల్పులు అయితే మీడియాను ఘటనా స్థలానికి ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. తహసీల్దార్ సమక్షంలో మధు మృతదేహాన్ని వీడియో చిత్రీకరణ, ఫొటోలు తీసుకునే అవకాశం కల్పించారని, మత ఎదుట ఎలాంటి పంచనామా, పోస్టుమార్టం చేయలేదని చెప్పారు. ఆదివాసీలను చంపడం మావోయిస్టుల లక్ష్యం కాదని, పోలీసులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు. మల్లయ్య అలియాస్ మధు మృతదేహాన్ని మీనాతో పాటు బంధువులు తీసుకెళ్లారు.